సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా
శనివారం । 10 । ఫిబ్రవరి । 2024






### కడప గడపలో లలితకళా వైభవం

సీమ విద్యార్థుల ఇంట విద్యావెలుగులు నింపా లన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్ ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ వర్సిటీ వార్షి కోత్సవం శనివారం జరగనుంది. -8లో



### ప్రశాంతత చెడగొట్టేందుకు కుట్ర

కడపలో ప్రశాంత వాతావరణాన్ని చెడ గొట్టేందుకు తెలుగుదేశం పార్టీ నాయకులు కుట్ర చేస్తున్నారని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఎస్.బి.అంజద్‌బాషా ఆరోపించారు. -8లో

గరిష్టం/కనిష్టం
37.6/21.1

### వాతావరణం

జిల్లాలో శుక్రవారం 21.1 - 37.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

## న్యూస్‌రీల్

### వైభవంగా పల్లకీసేవ


పల్లకీలో ఊరేగుతున్న శ్రీ భద్రకాళీ సమేతుడు

**రాయచోటి టౌన్:** రాయచోటి శ్రీ భద్రకాళీ సమేతుడికి అమావాస్య పూజలు నిర్వహించారు. శుక్రవారం రాత్రి స్వామి, అమ్మవారిని పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించారు. అనంతరం ఉత్సవ మూర్తులను పల్లకీలో కొలువుదీర్చారు. ఆలయ మాఢవీధులు, ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి, కన్నడ భక్తులు పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ


విద్యార్థిని అభినందిస్తున్న హెచ్‌ఎం సావిత్రి దేవి

**పెండ్లిమర్రి:** మండలంలోని గంగనపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థి పి.రెడ్డయ్య టెన్నికాయిట్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచాడు. కాంస్య పతకం సాధించినట్లు పాఠశాల హెచ్‌ఎం సావిత్రి దేవి, పీఈటీ శివశంకర్‌రెడ్డి తెలిపారు. ఈపోటీలు ఫిబ్రవరి 3 నుంచి 5వ తేదీ వరకు జరిగాయన్నారు. విద్యార్థికి హెచ్‌ఎం సావిత్రిదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

### ఆర్డీఓ కార్యాలయం తనిఖీ


కలెక్టర్ విజయరామరాజుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులు

**జమ్మలమడుగు:** జమ్మలమడుగులోని ఆర్డీఓ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ విజయరామరాజు శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఏ.శ్రీనివాసులుతో కలిసి కార్యాలయాన్ని పరిశీలించారు.అనంతరం అధికారులతో మాట్లాడారు. రాబోయే ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధంగా చర్యలను తీసుకోవాలన్నారు. లోపాలు లేని ఓటర్ల జాబితాలో తయారు చేయాలని తెలిపారు.

### హార్సిలీహిల్స్‌పై మినీ స్టూడియో

**బి.కొత్తకోట:** ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై మినీ స్టూడియో, అమ్యూజింగ్ సెంటర్ నిర్మాణం కోసం స్థల కేటాయింపునకు శుక్రవారం మదనపల్లె ఆర్డీఓ హరిప్రసాద్ పరిశీలన జరిపారు. కొండపై ఇప్పటికే క్రీడాశాఖకు కేటాయించిన భూమిని పరిశీలించి, అందులో కొంత భూమిని కేటాయించడం కోసం తహసీల్దార్ పుణ్యవతి, ఆర్ఐ బాలాజీ, సర్వేయర్ శ్రీవాణీ, వీఆర్‌ఓ నరేంద్రలతో సమీక్షించి రికార్డులు పరిశీలించారు. అనంతరం బయ్యప్పగారిపల్లెలో భూ బదలాయింపు ప్రతిపాదనలను పరిశీలించారు.

### వైజ్ఞానిక ప్రదర్శనకు సర్వం సిద్ధం


మాట్లాడుతున్న జిల్లా సైన్స్ అధికారి మహేశ్వర్‌రెడ్డి

**బద్వేలు అర్బన్:** స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు జరగనున్న జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆతిథ్య పాఠశాల ఆవరణలో కార్యక్రమ కో ఆర్డినేటర్ జి.వెంకటసుబ్బారెడ్డి, జిల్లా సైన్స్ అధికారి మహేశ్వర్‌రెడ్డిలు సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించి కమిటీ సభ్యులకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయం 9 గంటల నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. ఎంపికైన విద్యార్థులు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయించుకున్న అనంతరం రిజిస్ట్రేషన్ కమిటీ కేటాయించిన గదుల్లో ప్రదర్శనలను ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లా స్థాయిలో 19 ఉత్తమ ప్రదర్శనలను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. అలాగే పరిశీలనకు వచ్చే విద్యార్థులకు అనుకూలమైన సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆయా మండలాల ఎంఈఓలు చెన్నయ్య, రఘురాములు, ప్రమీల, సునీల్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు పెంచలయ్య, రమణయ్య, రాజేశ్వరి, విజయకుమారి, సెక్టోరియల్ అధికారి దశరథరామిరెడ్డి, ఆయా కమిటీల కన్వీనర్లు పాల్గొన్నారు.

# కేజీబీవీల్లో పంచతంత్ర

- వందశాతం ఫలితాల సాధనే లక్ష్యం
- పంచతంత్ర ప్రణాళిక అమలు
- అత్యుత్తమ మార్కులు సాధించిన వారికి బహుమతులు


విద్యార్థులకు స్టడీ అవర్ నిర్వహిస్తున్న కేజీబీవీ సిబ్బంది

**కడప ఎడ్యుకేషన్:** విద్యార్థి జీవితంలో పది, ఇంటర్ పరీక్షలు కీలకం.వారి జీవితాలు మలుపు తిరిగేది కూడా ఇక్కడే. ఇంతటి ప్రాధాన్యత ఉన్న పది, ఇంటర్‌లలో ఉత్తమ ఫలితాల సాధనకు విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందుకోసం స్టడీ ప్లానింగ్, వారాంతపు పరీక్షల నిర్వహణను చేపట్టారు. చదువులో వెనుకబడిన పిల్లలను సైతం కనీస మార్కులతో గట్టెక్కించేలా చూడాలని అధికారులు సీఆర్‌సీ, పీజీటీలు, స్పెషల్ ఆఫీసర్లను ఆదేశించారు. ఈ మేరకు పంచతంత్ర పేరుతో ఉత్తమ ఫలితాలను సాధించేందుకు ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేసి అమలుకు శ్రీకారం చుట్టారు. ఇందుకోసం ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులతోపాటు వారంతంలో గ్రాండ్ టెస్టు నిర్వహిస్తున్నారు. వీలైనంత మంది విద్యార్థులు ఉత్తమ మార్కులను సాధించేలా చర్యలు చేపట్టారు.

**ఇదీ ప్రణాళిక..**

కేజీబీవీల్లో చదువుతున్న పదో తరగతి, ఇంటర్ విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు సమగ్రశిక్ష ప్రాజెక్టు రాష్ట్ర అధికారులు పంచతంత్ర పేరుతో 100 రోజుల ప్రణాళిక తయారు చేశారు. ఈ ప్రణాళిక అన్ని కేజీబీవీల్లో ప్రారంభమైంది. ఇందుకోసం యాక్షన్ ప్లాన్‌ను తయారు చేసి అమలుకు శ్రీకారం చుట్టారు. ఇందులో ప్రతి రోజు ఉదయం 5 నుంచి 6.30 ప్రైవేటు టైమ్.. 6.30 నుంచి 7.30 వరకు సబ్జెక్టు ప్రిపరేషన్..7.30 నుంచి 8.30 వరకు వీక్లీ టెస్టు, 8.30 నుంచి 9 గంటల వరకు బ్రేక్‌ఫాస్ట్, 9 నుంచి 9.15 వరకు అసెంబ్లీ, 9.15 నుంచి 10.45 వరకు సబ్జెక్టు-1, 10.45 నుంచి 11 గంటల వరకు బ్రేక్, 11 గంటల నుంచి 12.30 వరకు సబ్జెక్టు-2, 12.30 నుంచి 1.15 వరకు లంచ్ బ్రేక్, 1.15 నుంచి 2.45 వరకు సబ్జెక్టు-3, 2.45 నుంచి 3 గంటల వరకు బ్రేక్, 3 నుంచి 4.30 వరకు సబ్జెక్టు-4, 4.30 నుంచి 5 వరకు బ్రేక్, 5 నుంచి 6.30 వరకు సబ్జెక్టు-5, 6.30 నుంచి 7.30 డిన్నర్. రాత్రి 7.30 న ఉంచి 10 గంటల వరకు సబ్జెక్టు-6 ఉంటుంది. ఇలా ప్రతి రోజు ప్రణాళిక అమలు జరుగుతుంది.

- జిల్లాలోని కేజీబీవీల్లో 90 శాతం పైన ఉత్తీర్ణులైన విద్యార్థులకు సమగ్రశిక్ష ద్వారా బహుమతి, ప్రశంసాపత్రం అందచేయనున్నారు.
- పది, ఇంటర్‌లో 100 శాతం ఫలితాలు సాధించిన కేజీబీవీలకు రూ. 25 వేలు నగదు బహుమతి ప్రశంసాపత్రం అందస్తారు.
- పది ఇంటర్ రెండింటిలో 100 శాతం ఫలితాలను సాధించిన కేజీబీవీలకు రూ. 50 వేలు నగదు బహుమతి, సర్టిఫికెట్ ఇస్తారు.
- సీఆర్‌టీ, పీజీటీలు తమకు సంబంధించిన సబ్జెక్టుల్లో 100 శాతం ఫలితాలను సాధిస్తే ప్రశంసా పత్రంతో సత్కరిస్తారు.
- 90 శాతం మార్కులు సాధించిన ప్రతి విద్యార్థికి రూ. 5 వేలు నగదు బహుమతి ఉంటుంది.

**జిల్లాలో 17 కేజీబీవీలు**

జిల్లాలో 17 కేజీబీవీలు ఉన్నాయి. ఇందులో 614 మంది పదో తరగతి చదువుతుండగా 373 మంది ఇంటర్ ప్రథమ , 290 మంది ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. వీరందరి కోసం సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారులు ప్రత్యేకంగా పంచతంత్ర ప్రణాళికలను అమలు చేస్తున్నారు. ఇందుకోసం కేజీబీవీల్లో పనిచేసే స్పెషల్ ఆఫీసర్లతోపాటు సీఆర్టీ, పీజీటీలు కొంత మంది విద్యార్థులను దత్తత తీసుకుని చదివిస్తున్నారు. ఒక్కొక్కరు ఐదుగురు విద్యార్థులను దత్తత తీసుకున్నారు. వారు ఎలా చదువుతన్నారు. ఏఏ సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్నారనే అంశాలను పరిశీలిస్తారు. లోపాలంటే వాటిని అధిగమించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటారు కార్యాచరణ అమలును కేజీబీవీల జీసీడీవో పర్యవేక్షిస్తారు.

**500 పైన మార్కులు సాధిస్తా..**



పదో తరగతి పరీక్షల కోసం కష్ట పడి చదువుతున్నా. ఈ ఏడాది 500 పైనే మార్కులు సాధిస్తా. మా కేజీబీవీ సీఆర్‌టీలు ప్రత్యేక చర్యలు తీసుకుని చదివిస్తున్నారు. నేను మంచి మార్కులు తెచ్చుకుని ప్రభుత్వం ప్రకటించిన 5 వేల బహుమతి అందుకునేందుకు కృషి చేస్తా. -శ్రీజ, పదోతరగతి, మైదుకూరు కేజీబీవీ

**పక్కాగా ప్రణాళిక అమలు**



ఈ ఏడాది వందశాతం ఉత్తీర్ణతను సాధించేందుకు పంచతంత్ర ప్రణాళికను పక్కగా అమలు చేస్తున్నాం . ప్రతి రోజు ఒకటి రెండు కేజీబీవీలను సందర్శిస్తూ ప్రత్యేక సూచనలు సలహాలను ఇస్తున్నాం. కచ్చితంగా ఈ సారి మంచి ఫలితాలను సాధిస్తాం. - విజయలక్ష్మి, జీసీడీఓ

**నిత్యం పర్యవేక్షణ**



కేజీబీవీలో పదోతరగతి పరీక్ష లంటే విద్యార్థులకు భయం లేకుండా మోటివేషన్ క్లాసులను కూడా నిర్వహించి వారిలో చైతన్యం నింపాం. దీంతోపాటు నిత్యం పర్యవేక్షిస్తున్నాం. ఈ ఏడాది కేజీబీవీల్లో ఉత్తమ ఫలితాలను సాధిస్తారని ఆశిస్తున్నా.
-ఎ.ప్రభాకర్‌రెడ్డి, సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి

**వందశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి**



కేజీబీవీల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు సిబ్బంది కృషి చేయాలి. పంచతంత్ర ప్రణాళిక పక్కాగా అమలు జరగాలి. డిప్యూటీ డీఈఓ, ఎంఈఓలు, జీసీడీఓలు కేజీబీవీలను సందర్శించాలి. మంచి ఫలితాల సాధనకు కృషి చేయాలి. -మర్రెడ్డి అనురాధ, డీఈఓ


### వైవీయూ ఆచార్యుడికి ప్రాజెక్టు మంజూరు


ప్రాజెక్టు మంజూరు పత్రాన్ని మధుసూదన్‌రెడ్డికి అందజేస్తున్న వీసీ, రిజిస్ట్రార్

**వైవీయూ:** యోగి వేమన విశ్వవిద్యాలయం వృక్షశాస్త్ర ఆచార్యులు, బొటానికల్ గార్డెన్ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ ఎ. మధుసూదన్‌రెడ్డికి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బయోడైవర్సిటీ బోర్డు రూ.43.27 లక్షల ప్రాజెక్టును మంజూరు చేసింది. ఏపీ బయోడైవర్సిటీ బోర్డ్ మెంబర్ సెక్రటరీ రమేష్ కుమార్ సుమన్ నుంచి ఉత్తర్వులు విశ్వవిద్యాలయానికి అందాయి. రాష్ట్రంలోని రైతుల ప్రయోజనం కోసం గ్లోరియోసా సూపర్బా ఎల్. సాగు, వాణిజ్యంపై పైలట్ ప్రాజెక్ట్‌గా దీన్ని పేర్కొన్నారు. వైవీయూ ఆచార్యునికి ప్రాజెక్టు రావడం పట్ల వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రఘునాథ్‌రెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య ఎన్ ఈశ్వర్ రెడ్డి, ఆర్ అండ్ డీ డైరెక్టర్ ఆచార్య చంద్ర ఓబులరెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆచార్య మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ గ్లోరియోసా సూపర్బా మొక్క ఆఫ్రికా, ఆగ్నేయాసియాలోని పలు ప్రాంతాలలో వ్యాధులను నయం చేయడానికి ఆయుర్వేద ఔషధ మూలికగా, కొల్చిసిన్ కంటెంట్ కోసం ఔషధ పరిశ్రమలచే విస్తృతంగా ఉపయోగిస్తున్నారని తెలిపారు. ఆర్థరైటిస్, గౌట్, రుమాటిజం, వాపు, అల్సర్, రక్తస్రావం పైల్స్, చర్మ వ్యాధులు, కుష్టు వ్యాధి, నపుంసకత్వము, పాము కాట్లు మొదలైన వాటిని నయం చేయడానికి ఈ మొక్కను ఉపయోగిస్తారు. మొక్కలను పెంచడం దగ్గర నుంచి వాటిని సంరక్షణ పద్ధతులు, ఎక్కువ విత్తనాల ఉత్పత్తి, అధిక దిగుబడి తదితర అంశాలపై శాస్త్రీయ పరిశోధన చేస్తామన్నారు. రాష్ట్రంలోని రైతుల ప్రయోజనం కోసం గ్లోరియోసా సూపర్బా ఎల్. సాగు వాణిజ్యీకరణపై పైలట్ ప్రాజెక్ట్‌ను మంజూరు చేయడం పట్ల బయోడైవర్సిటీ బోర్డుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధం కావాలి


సమావేశానికి హాజరైన పోలీసు అధికారులు



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్

- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి సారించాలి
- జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్

**కడప అర్బన్:** రానున్న సార్వత్రిక ఎన్నికలకు పోలీస్ అధికారులు, సిబ్బంది సన్నద్ధం కావాలని జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఆదేశించారు. ఎలాంటి ఘటనలకు తావు లేకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాలు చేయాలని సూచించారు. శుక్రవారం స్థానిక 'పెన్నార్'పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో కడప, కమలాపురం అసెంబ్లీ నియోజకవర్గాల పోలీస్ అధికారులు, సిబ్బందికి ఎన్నికల నేపథ్యంలో కార్యాచరణ ప్రణాళికపై జిల్లా ఎస్పీ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిటికల్/( క్లిష్టతర/ సమస్యాత్మక) పోలింగ్ కేంద్రాలు, ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గత ఎన్నికల్లో నేరాలకు పాల్పడిన వారిపై నిఘా ఉంచాలని ఆదేశించారు. మద్యం, నగదుతో ఓటర్లను ప్రలోభపెట్టే వారిపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల ప్రజలతో సత్సంబంధాలు పెంపొందించుకుని సమస్యల గురించి ముందస్తు సమాచారం సేకరిస్తూ ఉండాలన్నారు. ఏదైనా సంఘటన జరిగినపుడు వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) లోసారి సుధాకర్, ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్.ఎస్.ఎస్.వి కృష్ణారావు, కడప డీఎస్పీ ఎండీ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

**సిబ్బంది సమస్యలు పరిష్కరిస్తాం**

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ కడపలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ 'గ్రీవియన్స్‌డే'నిర్వహించారు. జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్లు, ఆయా విభాగాల్లో విధులను నిర్వర్తిస్తున్న పోలీసు సిబ్బంది సమస్యలను విన్నవించుకున్నారు. జిల్లా ఎస్పీ స్పందిస్తూ సమస్యలకు తగిన పరిష్కారం చూపుతామని సిబ్బందికి భరోసా కల్పించారు.

## ఆల్‌బెండజోల్‌తో నులిపురుగుల నుంచి రక్షణ

**డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు**


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ నాగరాజు

**సిద్దవటం:** ఆల్‌బెండజోల్ మాత్రలతో నులిపురుగులను నివారించవచ్చని డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు తెలిపారు. నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం సిద్దవటంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు నులిపురుగుల నివారణకు ఇచ్చే ఆల్‌బెండజోల్ మాత్రలను నమిలి మింగేటట్లు చూడా లని తెలిపారు. ప్రతి సంవత్సరం జనవరి, ఫిబ్రవరి, ఆగస్టు,సెప్టెంబర్ నెలల్లో ఈ మాత్రలను ఇస్తున్నట్లు చెప్పారు. 1 సంవత్సరం నుంచి 19 సంవత్సరాల వరకు అందరికీ మాత్రలు వేయనున్నట్లు డీఎంహెచ్‌ఓ తెలిపారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు, ఎంపీహెచ్‌ఓ ప్రసాద్, పి.కొత్తపల్లి పిహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ రంగ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

**మెరుగైన వైద్య సేవలు అందించాలి**

జగనన్న ఆరోగ్య సురక్షకు వచ్చిన పేషెంట్లకు మెరుగైన వైద్య సేవలను అందిచాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు తెలిపారు. సిద్దవటం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అవరణంలో శుక్రవారం జరిగిన రెండోవిడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యాక్రమాన్ని డీఎంహెచ్‌ఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపీని పరిశీలించారు. పేషెంట్ల సంఖ్య తుక్కువగా నమోదు కావడంతో వలంటీర్ల ద్వారా పేషెంట్ల సంఖ్యను పెంచాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఈఓపీ ఆర్‌డీ పులిరామ్‌సింగ్, గ్రామ కార్యదర్శి ప్రసాద్ రెడ్డి, వైద్యులు డాక్టర్ రంగలక్ష్మి, డాక్టర్ రెహమాన్, డాక్టర్ శైనీ షారోన్, ఆప్తాల్మిక్ అధికారి లక్ష్మికర్ రెడ్డి, గ్రామ సచివాలయ సిబ్బంది, వైద్యసిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## హైవే భూ సేకరణ పరిశీలన


అధికారులతో మాట్లాడుతున్న జేసీ గణేష్ కుమార్

**ప్రొద్దుటూరు:** రాయచోటి - చాగలమర్రి హైవే రోడ్డుకు సంబంధించిన భుసేకరణను జిల్లా జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. రోడ్డు నిర్మాణం జరగనున్న నంగనూరుపల్లె, కొత్తపల్లె, గోపవరం ప్రాంతాలను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఏ ప్రాంతంలో భూములు ధరలు ఏవిధంగా ఉన్నాయని అడిగారు. రోడ్డు నిర్మాణంలో ఇళ్లు కోల్పోయిన వారికి తిరిగి ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. అనంతరం గోపవరం గ్రామ సచివాలయం-1లో జరుగుతున్న జగనన్న కాలనీ ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను తనిఖీ చేశారు. రోజుకు ఎన్ని పట్టాలు రిజిస్ట్రేషన్ చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. జేసీ వెంట తహసీల్దార్ విద్యాసాగర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.


**ఎర్రగుంట్ల:** ఎర్రగుంట్ల మండలం మీదుగా త్వరలో నిర్మిస్తున్న వేంపల్లి - చాగలమరి ఎక్స్‌ప్రెస్ నేషనల్ జాతీయ రహదారికి సంబంధించి భూములను జిల్లా జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ పరిశీలించారు. మండలంలో పెద్దనపాడు, వై కోడూరు, యర్రగుంట్ల, పోట్లదుర్తి, హనుమనుగుత్తి గ్రామాల్లో భూములను సర్వే చేశారు. దీనికి సంబంధించి ల్యాండ్ మ్యాప్‌ను జేసీ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎర్రగుంట్ల తహసీల్దార్ సౌజన్యలక్ష్మి, సర్వేయర్లు పాల్గొన్నారు.

## మధ్యతరగతి ప్రజలకు వరం ఎంఐజీ లేఅవుట్


మాట్లాడుతున్న ఆర్డీఓ ఆకులవెంకటరమణ

**బద్వేలు అర్బన్:** జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్ ఎంఐజీ లేఅవుట్ మధ్యతరగతి ప్రజలకు వరం లాంటిదని ఆర్డీఓ ఆకులవెంకటరమణ, కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వీసీ వై.ఓ.నందన్‌లు పేర్కొన్నారు. బద్వేలుకు సమీపంలోని శ్రీనివాసపురం వద్ద ఏర్పాటు చేసిన ఎంఐజీ లేఅవుట్‌లో ప్లాట్లకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు శుక్రవారం మున్సిపల్ కార్యాలయ సభా భవనంలో లాటరీ ద్వారా ప్లాట్లు కేటాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీనివాసపురం సమీపంలో 30.42 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఎంఐజీ లేఅవుట్‌లో మొత్తం 358 ప్లాట్లు ఉండగా అందులో మూడు సెంట్లకు సంబంధించినవి 61, నాలుగు సెంట్లకు సంబంధించినవి 155, ఐదు సెంట్లకు సంబంధించినవి 114 ఉన్నాయి. ఇతర కొలతల్లో 28 ప్లాట్లు ఉన్నాయన్నారు. ఇటీవలే పూర్తిస్థాయిలో అన్నిరకాల అనుమతులు సిద్ధం కావడంతో దరఖాస్తుల ప్రక్రియ వేగవంతమైందన్నారు. తొలిదశలో 97 దరఖాస్తులు రాగా వాటిలో 10 శాతం ధర చెల్లించిన 44 మంది లబ్ధిదారులకు ప్లాట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.క్రిష్ణ, కుడా ప్లానింగ్ ఆఫీసర్ శైలజ, అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్ మహమ్మద్‌ఆసిఫ్, జూనియర్ ప్లానింగ్ ఆఫీసర్ శారదమ్మ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో అంకురార్పణ


దేవుని కడపలోని లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో అంకురార్పణ పూజలు నిర్వహిస్తున్న అర్చకులు


పుట్టమన్ను తెస్తున్న అర్చకులు

కడప రాయుడు కప్పురపు రాయుడయ్యాడు. బ్రహ్మాండ నాయకుడు బ్రహ్మోత్సవ కళను సంతరించుకున్నాడు. పరిసరాలన్నింటికీ కొత్త పరిమళాలను సంతరించి పెట్టాడు. జిల్లాకే తలమానికంగా నిలిచే తిరుమల వాసుని ప్రతిరూపంగా కడప గడపను దివ్యంగా వెలిగిస్తూ అంతటా ఉత్సవ శోభను కల్పించాడు. నేటి నుంచి పది రోజులపాటు రోజుకో వాహనంపై సూర్యప్రభ తేజంతో వెలిగిపోనున్నాడు. ఆ మహా మంగళమూర్తి బ్రహ్మోత్సవాలు ఒళ్లంతా కళ్లు చేసుకుని చూసినా తనవి తీరదు.

**వైభవంగా కడపరాయుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం**

**కడప కల్చరల్:** దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం ఆలయ అర్చకులు మయూరం కృష్ణమోహన్, తివిక్రమ్‌లతోపాటు మరికొందరు వేద పండితులు దీక్షా తిరుమంజనం కార్యక్రమాన్ని జరిపారు. తొలుత విశ్వక్సేనునికి పూజ చేసి పుణ్యాహవాచనం నిర్వహించారు. రక్షా కంకణధారణ అనంతరం పల్లకీలో ఊరేగింపుగా పుష్కరిణి వద్దకు టీటీడీ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డిల ఆధ్వర్యంలో తరలి వెళ్లారు. అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. మృత్సంగ్రహణం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ పుట్టమట్టిని పల్లకీలో ఊరేగింపుగా ఆలయానికి చేర్చి అంకురార్పణ వేడుకగా జరిపారు.. ప్రత్యేక విద్వాంసుల నాదస్వర, మంగళ వాయిద్యాల విన్యాసాలు ఉత్సవాలకు భక్తులను ఆహ్వానించాయి. అంకురార్పణ కార్యక్రమాన్ని తిలకించేందుకు విశేష సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

**నేడు ధ్వజారోహణం**

బ్రహ్మోత్సవాల్లోభాగంగా శనివారం ఉదయం 10.30 నుంచి 11.00 గంటల్లోపు తిరుచ్చి, ధ్వజారోహణ కార్యక్రమాలను నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటల నుంచి అమ్మవారి సన్నిధిలో ఊంజల్‌సేవ జరుగుతుంది. ఇదే సమయంలో టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు స్వామిపై కీర్తనలు ఆలపించనున్నారు. రాత్రి 6.30 గంటలకు చంద్ర ప్రభ వాహనంపై స్వామిని కొలువుదీర్చనున్నారు. తర్వాత స్వామి మహిమల గురించి కళాకారులు హరికథ ద్వారా వివరిస్తారు.

## క్లుప్తంగా

### వీధి కుక్కల స్వైరవిహారం



కుక్కల దాడిలో గాయపడి ప్రభుత్వాసుపత్రికి చికిత్స కోసం వచ్చిన బాధితులు

**బద్వేలు అర్బన్ :** పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో శుక్రవారం వీధికుక్కలు స్వైరవిహారం చేశాయి. ఈ ఘటనల్లో పలువురికి గాయాలయ్యాయి. పట్టణంలోని శివానగర్, మార్తోమానగర్, శ్రీకృష్ణదేవరాయనగర్, పూలబావివీధి, భావనారాయణనగర్, సాయినగర్, తెలుగుగంగరోడ్డు, గాంధీనగర్, కొండారెడ్డివీధిలలో వీధికుక్కలు ప్రజలపై దాడులు చేయడంతో సుమారు 20 మందికి పైగా ప్రజలు గాయపడ్డారు. వీరంతా స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ ఎం.క్రిష్ణ మున్సిపల్ సిబ్బందిని పురమాయించి ఆయా వీధుల్లో ప్రజలపై దాడులు చేసిన కుక్కలను పట్టించి ఊరి బయట వదిలిపెట్టారు.

### నిధుల గోల్‌మాల్‌పై చర్యలు

**నందలూరు (రాజంపేట) :** మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీలో నిధుల గోల్‌మాల్‌పై ఒకరిని సస్పెండ్ చేయగా, మరొకరికి షోకాజ్ నోటీస్ అందజేశారు. ఉన్నతాధికారులకు అందిన ఫిర్యాదు మేరకు నిర్వహించిన దర్యాప్తులో.. రూ.1.75 లక్షలు పంచాయతీ నిధుల స్వాహాలో బిల్ కలెక్టర్ పోలిచెర్ల నరసింహులను సస్పెండ్ చేశారు. సిబ్బందికి అధిక జీతాల పేరిట గోల్‌మాల్‌లో కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ కాకమూరి నరసింహులుకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు.

### తల్లీబిడ్డల ఆచూకీ లభ్యం

**మదనపల్లె :** అదృశ్యమైన తల్లీబిడ్డల ఆచూకీ లభ్యమైనట్లు శుక్రవారం తాలూకా సీఐ ఎన్. శేఖర్ తెలిపారు. మండలంలోని కొత్తపల్లి పంచాయతీ సందిరెడ్డిగారిపల్లెకు చెందిన లక్ష్మీపతి భార్య మమత(30), ఆమె కుమార్తె వర్షిత (2) జనవరి 28వ తేదీన ఇంటి నుంచి వెళ్లి కనిపించకుండా పోయారు. ఆమె భర్త, కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించకపోవడంతో జనవరి 31వ తేదీన లక్ష్మీపతి తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదృశ్యమైన మహిళ బిడ్డతో సహా కలకడ మండలం రాతికుంటపల్లె గ్రామంలో ఉంటున్నట్లు తెలుసుకుని వారిని అక్కడ నుంచి తాలూకా పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు.

# కడప గడపలో లలితకళా వైభవం

కరువు సీమలో విద్యాసౌరభాలు వెదజల్లాలని.. సీమ విద్యార్థుల ఇంట విద్యావెలుగులు నింపాలన్న లక్ష్యంతో కడప నగరంలో డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ఆర్ట్స్ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేశారు. 2020లో ప్రారంభమైన విశ్వవిద్యాలయం శనివారం 4వ వార్షికోత్సవం నిర్వహించనున్న నేపథ్యంలో ప్రత్యేక కథనం.

**నేడు డాక్టర్ వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ 4వ వార్షికోత్సవం**




డాక్టర్ వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ తాత్కాలిక భవనం

**ఏఎఫ్‌యూ :** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో కడప నగరంలో 2020 జనవరి 3న విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జనవరి 7న వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయంగా ఏర్పాటైంది. నాలుగు సంవత్సరాల వ్యవధిలోనే చక్కటి ప్రగతిని సాధిస్తూ రాష్ట్ర స్థాయి విశ్వవిద్యాలయంగా గుర్తింపు సాధించింది. స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్, కాలేజ్ ఆఫ్ ఫైన్ఆర్ట్స్ పేరుతో 13 కోర్సులు, ఎం.ప్లాన్ పేరుతో ఒక పీజీ కోర్సుతో మొత్తం 14 స్పెషలైజ్డ్ కోర్సులతో 500 మందికిపైగా విద్యార్థులతో విశ్వవిద్యాలయం కళకళలాడుతోంది. రాష్ట్రంలోని విద్యార్థులే కాకుండా తెలంగాణ ప్రాంతానికి చెందిన విద్యార్థులు సైతం ఏటా ప్రవేశాలు పొందుతూ విద్యనభ్యసిస్తున్నారు. నాటా, ఏపీ ఈఏపీసెట్(ఎంసెట్), ఆర్ట్ అండ్ డిజైన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌ల ద్వారా ఇందులో ప్రవేశాలు పొందుతున్నారు. విశ్వవిద్యాలయ విద్యార్థులు ప్రతిభను కనబరుస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతిని ఆర్జిస్తుండటం విశేషం.

**అభివృద్ధి దిశగా అడుగులు**

విశ్వవిద్యాలయం ఏర్పాటైన తర్వాత ఒక్కొక్క సౌకర్యం సమకూర్చుకుంటూ అభివృద్ధి వైపు అడుగులు పడుతున్నాయి. ప్రస్తుతానికి కడప నగరం గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలోని తాత్కాలిక భవనాల్లో నిర్వహిస్తున్నారు. శాశ్వత భవన నిర్మాణాలకు సంబంధించి యోగివేమన విశ్వవిద్యాలయం పక్కన 110 ఎకరాలు కేటాయించారు. అయితే స్థలసేకరణ, ఎంపికలో సందిగ్ధత నెలకొనడంతో ప్రక్రియ కాస్త మందగించింది. ఈ ప్రక్రియ ఒక కొలిక్కి వచ్చిన వెంటనే సొంత భవనాల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టనున్నారు. జిల్లా కలెక్టర్ వి.విజయరామరాజు కృషితో రూ.1.15 కోట్ల నిధులతో విశ్వవిద్యాలయంలో త్రీడీ ల్యాబ్ ఏర్పాటు చేశారు. విశ్వవిద్యాలయ విద్యార్థులు పలు రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తూ ప్రత్యేకతను చాటుతుండటం విశేషం.

**నేడు వ్యవస్థాపక వేడుకలు**

డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం 4వ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్నాయి. ముఖ్య అతిథిగా ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి, గౌరవ అతిథిగా వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్ హాజరుకానున్నారు. వీరితోపాటు విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య బానోతు ఆంజనేయప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి.సురేంద్రనాథ్‌రెడ్డి వేడుకల్లో పాల్గొననున్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లు ప్రదానం చేయనున్నారు.

## వైఎస్సార్‌సీపీలో 155 కుటుంబాల చేరిక



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన రాజీవ్‌నగర్ వాసులు

**జమ్మలమడుగు రూరల్ :** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై వైఎస్సార్‌సీపీ పార్టీలో చేరడం జరిగిందని జమ్మలమడుగు మండలం గూడెంచెరువు గ్రామంలోని రాజీవ్‌నగర్ కాలనీ వాసులు పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో 155 కుటుంబాలు వైఎస్సార్‌సీపీ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం రాజీవ్‌నగర్‌లో గడప గడపకు వెళ్లి ఎమ్మెల్యే ప్రజలను పలకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో ప్రజలకు తిరిగి మోసం చేసేందుకు వస్తున్నాడని, ప్రజలు ఎవరూ కూడ నమ్మవద్దని హితవు పలికారు. చంద్రబాబు నాయుడు హయాంలో రాష్ట్రంలో ఎటువంటి అభివృద్ధి చేయలేదని విమర్శించారు. వైఎస్ జగనన్న హయాంలో సంక్షేమ పథకాలు పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ మంజూరు అయ్యాయన్నారు. కావున మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాతకుంట మహేష్, పాతకుంట సుబ్బారెడ్డి, రంగస్వామి, రమణయ్య యాదవ్, సంజీవరాయుడు, టంగుటూరు రాము, శేషారెడ్డి (రియల్టర్) రమణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## చర్చిలో హత్య కేసులో సంచలన తీర్పు

- ఇరువురికి యావజ్జీవం
- మరో ముగ్గురికి మూడేళ్ల శిక్ష
- ఎనిమిదేళ్ల క్రితం యువకుడి హత్య



నిందితులను హాజరు పరిచిన పోలీసులు

**ముద్దనూరు :** 2016 ఫిబ్రవరి 7వ తేదీన ముద్దనూరు యల్‌యమ్ కాంపౌండ్‌లోని చర్చిలో యామవరం ఉదయ్‌కుమార్ అనే యువకుడు హత్యకు గురయ్యాడు. ఈ హత్య కేసులోని నిందితుల్లో ఇరువురికి యావజ్జీవ శిక్ష, మరో ముగ్గురికి జైలుశిక్ష విధిస్తూ ప్రొద్దుటూరు 2వ అదనపు జిల్లా న్యాయస్థానం న్యాయమూర్తి జీయస్ రమేష్‌కుమార్ శుక్రవారం సంచలన తీర్పు నిచ్చారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. 2016లో సీయస్ఐ చర్చి ఆదాయవ్యయాలపై చర్చి సభ్యులు సమావేశమయ్యారు. చర్చికి సంబంధించిన లెక్కలు చెప్పాలని ఓ వర్గంవారు మరో వర్గంవారిని కోరారు. ఆ సమయంలో బోనం అనిల్‌కుమార్, అతడి తండ్రి రాజారత్నంలు చర్చికి సంబంధించిన ఆదాయవ్యయాలు చూస్తున్నారు. వారిని లెక్కలు చెప్పాలని మరో వర్గంవారు కోరడంతో చర్చిలో వాగ్వాదంతో ఘర్షణ జరిగి ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ ఘర్షణలో ఉదయ్‌కుమార్ అనే యువకుడిని కత్తులతో పొడిచారు. ఈ సంఘటనలో ఉదయ్ కుమార్ మరణించాడు. ఈ ఘర్షణలో రమేష్, అనిల్, సాలెం, రాజ్, సుధాకర్‌లకు కత్తి గాయాలయ్యాయి. అప్పట్లో బోనం ప్రశాంత్‌కుమార్ ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసుస్టేషన్‌లో మొత్తం 7 మందిపై కేసు నమోదు చేశారు. కేసు విచారణలో అనంతరం న్యాయమూర్తి శుక్రవారం కేసులో నిందితులైన బోనం సురేష్‌కుమార్, బోనం రవిలకు యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.1లక్షా50వేల జరిమానా విధించారు. మిగిలిన నిందితుల్లో అశోక్‌కు 3 సంవత్సరాలు జైలు, రూ.50 వేల జరిమానా, అనిల్‌కుమార్‌కు 3ఏళ్ళ జైలు, రూ.2లక్షల జరిమాన, రాజారత్నంకు 3సంవత్సరాలు జైలు, రూ.1 లక్ష జరిమానా విధించారు. కాగా ఈ కేసులో ఇరువురు నిందితులు దేవసహాయం, ధనరాజ్‌లు ఇప్పటికే మృతి చెందారు.




వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. దయనీయ స్థితిలో ఉన్న సర్కారు బడుల రూపురేఖలు నాడు–నేడుతో ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. – సాక్షి నెట్‌వర్క్

**సొంతిల్లు కట్టుకున్నాం**



మేము టీడీపీలో ఉన్నప్పటికీ.. ఆ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పడిన గత ప్రభుత్వంలో ఇల్లు మంజూరు కాలేదు. జగనన్న ముఖ్యమంత్రి అయిన తరువాత స్థలంతోపాటు ఇల్లు మంజూరైంది. మా కష్టం కూడా తోడు చేసి సొంతిల్లు కట్టుకున్నాం. హాయిగా జీవిస్తున్నాం. చాలా ఆనందంగా ఉంది. జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– నడివీధి శశికళ, ఎస్సీ కాలనీ, వంతాటిపల్లి, సిద్దవటం మండలం

**ఇంటి వద్దకే పథకాలు**



వ్యవసాయమే ఆధారంగా చేసుకుని జీవనం సాగిస్తున్నాం. మా లాంటి వారికి జగనన్న ప్రభుత్వంలో ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు వస్తున్నాయి. అర్హతే ప్రామాణికంగా వలంటీర్లు సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు మంజూరు చేస్తున్నారు. నా పేరిట ప్రతి ఏటా రైతు భరోసా ద్వారా రూ.12,500లతోపాటు నా కుమారుడు నవీన్‌కు అమ్మ ఒడి, నా భార్య వలస సునీత పేరిట జగనన్న పక్కా గృహం, ఆసరా సొమ్ము ఇలా అన్ని పథకాలు మంజూరయ్యాయి. కావున జగనన్న ప్రభుత్వమే మళ్లీ రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము.

– వలస బాలాజీ, కందుకూరు, పెద్దతిప్పసముద్రం మండలం, అన్నమయ్య జిల్లా



## ప్రశాంత వాతావరణం చెడగొట్టేందుకు టీడీపీ కుట్ర

**ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా.ధ్వజం**



వైఎస్సార్‌సీపీ కార్యకర్త పీరుల్లాను పరామర్శిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా

**కడప కార్పొరేషన్ :** కడపలో ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టేందుకు తెలుగుదేశం పార్టీ నాయకులు కుట్ర చేస్తున్నారని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఎస్.బి.అంజద్‌బాషా ఆరోపించారు. శుక్రవారం ‘గడప గడపకు మన ప్రభుత్వం’లో భాగంగా 33వ డివిజన్‌లోని బళ్లారి రోడ్, శివలింగం బీడీ ఫ్యాక్టరీ ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏవిధంగా చేరుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. అనంతరం డిప్యూటీ సీఎం మీడియాతో మాట్లాడుతూ తాను ఇప్పటి వరకూ ఆరు ఎన్నికలను చూశానని, ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఆ ఎన్నికల వరకే రాజకీయాలు ఉండేవని ఆ తర్వాత అందరం కలిసిమెలిసి ఉండే పరిస్థితి ఉందన్నారు. హైదరాబాద్ నుంచి దిగుమతి అయిన నాయకులు కడపలో కొత్త సంస్కృతి తీసుకొస్తున్నారని, యువతను హత్యా రాజకీయాలవైపు ప్రేరేపిస్తూ తమ పబ్బం గడుపుకొంటున్నారన్నారు. టికెట్ ఖరారు కాకమునుపే ప్రచారం చేస్తూ .. రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తూ ఏదో ఒక రకంగా సమస్యలు సృష్టించే యత్నాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇదివరకు వలంటీర్ ఇంటిపైకి దాడికి పోయారని, నిన్న సోషల్ మీడియా కన్వీనర్ సునీతకు పదే పదే ఫోన్లు చేసి బెదిరించారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, 33వ డివిజన్ ఇన్‌చార్జి చాక్లెట్ గౌస్, వైఎస్సార్‌సీపీ నాయకులు అహ్మద్‌బాషా, పి.జయచంద్రారెడ్డి, బంగారు నాగయ్యయాదవ్, ఎస్.సుబ్బారెడ్డి, ఐస్‌క్రీం రవి, రామలక్ష్మణ్‌రెడ్డి, తోటక్రిష్ణ, దేవిరెడ్డి ఆదిత్య, మునిశేఖర్‌రెడ్డి, లక్ష్మినారాయణ, సంపత్, కంచుపాటి బాబు, పత్తిరాజేశ్వరి, ఉమామహేశ్వరి, మల్లీశ్వరి, తులశమ్మ, చైతన్య పాల్గొన్నారు.

**పీరుల్లాను పరామర్శించిన డిప్యూటీ సీఎం**

తెలుగుదేశం పార్టీ కార్యకర్త దాడిలో గాయపడి రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్పొరేటర్ తనయుడు పీరుల్లాను ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఈ ఘటనకు దారితీసిన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కమాల్‌బాషా, షఫీ, రామ్మోహన్‌రెడ్డి, తోటక్రిష్ణ పాల్గొన్నారు.

**హత్యాయత్నం కేసులో ఇద్దరు అరెస్ట్**

**కడప అర్బన్:** కడప నగరంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 39వ డివిజన్ కార్పొరేటర్ షఘానా, కమాల్‌బాషాల కుమారుడు షేక్ పీరుల్లా (26)పై అదే ప్రాంతానికి చెందిన టీడీపీ కార్యకర్త ఆరీఫ్, అతడి తండ్రి రాజా సాహెబ్‌లు గురువారం కత్తితో దాడి చేసి హత్యాయత్నం చేశారు. ఈ సంఘటనలో నిందితులైన ఆరీఫ్, అతని తండ్రి రాజాసాహెబ్‌ను శుక్రవారం సీఐ తబ్రేజ్ తమ సిబ్బందితో కలిసి అరెస్ట్ చేశారు.

## ఘనంగా డీసీసీ బ్యాంక్ ఆవిర్భావ దినోత్సవం



జీఎం రాజామణి టీమ్‌కు మొదటి బహుమతి అందజేస్తున్న చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి

**కడప అగ్రికల్చర్ :** కడప డీసీసీ బ్యాంకు ఏర్పాటై 106 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శుక్రవారం కడప డీసీసీ బ్యాంకులో 106వ అవిర్భావ దినత్సోవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి, బ్యాంకు సీఈఓ కందుల రాజేంద్రకుమార్‌లతోపాటు బ్యాంకు సిబ్బంది కలిసి సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా చైరపర్సన్ మల్లెల ఝాన్సీరాణి మాట్లాడుతూ 1919లో కడప జిల్లా రైతుల ప్రయోజనాల కోసం సహకారం రంగంలో ఏర్పడిన తొలి బ్యాంకు మన కడప డీసీసీ బ్యాంకు అన్నారు. ఈ బ్యాంకు రైతులకు పంట రుణాలు, భూములు, పంటల అభివృద్ధి కోసం, పశుపోషణ, గొర్రెలు, మేకలు, ఉద్యాన పంటల పెంపకం, వాటి అభివృద్ధికి ఇతర వ్యవసాయ అవసరాలకు యంత్రాలు, పనిముట్ల కొనుగోలు కోసం అవసరమైన మధ్యకాలిక, దీర్ఘకాలిక రుణాలను అందించినట్లు తెలిపారు. ఈ మేరకు పండగ కాంపెయిన్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన టీమ్‌లకు బ్యాంకు చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి చేతుల మీదుగా మెమెంటోలు, బహుమతులను ఇచ్చి సత్కరించటం జరిగింది. ఇందులో కరెంట్, సేవింగ్స్, టర్మ్ డిపాజిట్లలో అత్యుత్తమ ఫలితాలను సాధించిన జీఎం రాజామణి టీమ్‌కు ప్రథమ బహుమతి, రుణాలలో అత్యుత్తమ ఫలితాలను సాధించిన ఏజీఎం రాజేంద్రప్రసాద్‌రెడ్డి టీమ్‌కు, టర్మ్ డిపాజిట్లు, రుణాలలో ప్రతిభ చాటిన బ్రహ్మం టీమ్‌లకు ద్వితీయ బహుమతులు, కరెంట్, సేవింగ్స్‌లో ప్రతిభ చాటిన బాలిరెడ్డి టీమ్‌కు రెండవ బహుమతితోపాటు మెమెంటోలను అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

## ఒలింపియాడ్‌లో ‘భారతి’ విద్యార్థుల ప్రతిభ



ఒలింపియాడ్ పరీక్షల్లో విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపల్ కిషోర్ కుమార్

**కమలాపురం :** మండల పరిధిలోని నల్లలింగాయపల్లెలో వెలసిన డీఏవీ భారతి విద్యా మందిర్ విద్యార్థులు లిటిల్ స్టార్ ఇంగ్లిష్, మ్యాథ్స్, సైన్స్ ఒలింపియాడ్ పరీక్షల్లో ప్రతిభ చాటి బంగారు పతకాలు సాధించారు. గత అక్టోబర్ నెలలో సిల్వర్ జోన్ న్యూఢిల్లీ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన లిటిల్ స్టార్ ఒలింపియాడ్ ఇంగ్లిష్‌లో ఎల్‌కేజీ, యూకేజీ నుంచి 39 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. అలాగే మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో 34 బంగారు పతకాలు, సైన్స్‌లో 23 బంగారు పతకాలు సాధించారు. కాగా నిర్వాహకులు వారికి పతకాలతోపాటు ప్రశంసా పత్రాలు అందజేశారు. శుక్రవారం ప్రిన్సిపల్ కిషోర్ కుమార్ బంగారు పతక విజేతలను అభినందించారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని విద్యార్థులకు సూచించారు. హెచ్‌ఆర్ చీఫ్ మేనేజర్ గోపాల్‌రెడ్డి విద్యార్థులు, ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు.

### రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరి మృతి

**రామాపురం :** మండలంలోని కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ మేదరపల్లి– నీలకంఠ్రావుపేట ప్రధాన రహదారిలోని పూలతోటవంక సమీపంలో శుక్రవారం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ వి.ఎల్.ప్రసాద్‌రెడ్డి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కల్పనాయునిచెరువు గ్రామానికి చెందిన వీఆర్‌ఏ సుబ్బరాయుడు(70) ఇంటి నుంచి స్కూటీలో మేదరపల్లికి వెళ్తుండగా.. మార్గంమధ్యలో మేదరపల్లి నుంచి నీలకంఠ్రావుపేటకు వెళ్తున్న ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో వీఆర్‌ఏ టి. సుబ్బరాయుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ద్విచక్ర వాహనంలో వస్తున్న సత్యానారాయణ, ఆయన భార్య వాణి, కుమారుడు శ్రీనివాసులకు తీవ్ర గాయాలు అయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని బాధితులను 108లో కడప రిమ్స్‌కు తరలించారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## రైలులో బంగారు నగలు స్వాధీనం



పట్టుకున్న నిందితులతో ఆర్‌పీఎఫ్ అధికారులు, సిబ్బంది

**కడప కోటిరెడ్డిసర్కిల్ :** కోయంబత్తూరు నుంచి బంగారు నగలను తీసుకు వెళుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని, 2 కిలోల 350 గ్రాముల ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని కడప రైల్వే సీఐ నాగార్జున తెలిపారు. శుక్రవారం కడప రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. గుంతకల్లు రైల్వే ఎస్పీ చౌడేశ్వరి ఆదేశాల మేరకు తిరుపతి రైల్వే డీఎస్పీ షేక్ షా ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా కోయంబత్తూరు నుంచి బంగారు నగలను తీసుకొస్తున్న ఇరువురు కడపలో అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి విచారించగా బంగారు ఆభరణాలు లభ్యమయ్యాయని తెలిపారు. వాటిని ఇన్‌కం ట్యాక్స్ అధికారులకు అప్పగించామన్నారు. నిందితులను అరెస్టు చేయడంలో కృషి చేసిన తనతోపాటు ఎస్ఐ శ్రీనివాసరావు, ఆర్ఎస్ఐ విజయ నరసింహులు, రవిచంద్ర, సిబ్బంది ఫిరోజ్, సుబ్బయ్యలను రైల్వే ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారన్నారు. రైల్వే ప్రయాణికులు ప్రయాణ సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అలాగే ప్రయాణ సమయంలో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే తమకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ సీఐ శ్రీనివాసులు, రైల్వే పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## వారసత్వ సంపదను రక్షించుకుందాం




ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు, అతిథులు

**కడప కల్చరల్ :** మన పూర్వీకులు అద్భుతమైన వారసత్వ సంపద అందించారని, దాన్ని రక్షించుకునే బాధ్యతపై నేటి తరానికి వివరించాలని ప్రభుత్వ పురుషుల కళాశాల రవీంద్రనాథ్ అన్నారు. ఇంటాక్ (భారత జాతీయ కళా సంస్కృతి వారసత్వ పరిరక్షణ సంస్థ) కేంద్ర కమిటీ పిలుపు మేరకు దేశంలోని అన్ని రాష్ట్రాలు, జిల్లాల చాప్టర్ల ఆధ్వర్యంలో ‘మై మాన్యుమెంట్ సెల్ఫీ’ పేరిట విద్యార్థులకు పోస్టర్ డిజైనింగ్ పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటాక్ జిల్లా ఛాప్టర్, కన్వీనర్ చిన్నపరెడ్డి మాట్లాడుతూ మన నిర్లక్ష్యం వల్ల, వాటి గురించి సరైన అవగాహన లేకపోవడం వల్ల ఎంతో విలువైన వారసత్వ సంపద కళ్లముందే నాశనం అవుతోందని, దాన్ని రక్షించేందుకే ఇంటాక్ కృషి చేస్తోందని తెలిపారు. ఇంటాక్ అన్నమయ్య సభ్యులు షేక్ అబ్దుల్లా, మన జిల్లా కో కన్వీనర్ పీవీ సుబ్బారెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షులు పోతుల వెంకట్రామిరెడ్డి, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజులు మాట్లాడుతూ జిల్లాలో ఎన్నో అపురూపమైన, చారిత్రక కట్టడాలు ఉన్నాయని తెలిపారు. పోస్టర్ డిజైనింగ్ పోటీకి వివిధ పాఠశాలల నుంచి 110 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. వారికి అవసరమైన డ్రాయింగ్ షీట్లు, తెల్ల కాగితాలు, పరీక్షా పేపర్లను సంస్థ అందజేసింది. కార్యక్రమ కన్వీనర్, కో కన్వీనర్ బోగాల కొండారెడ్డి, రాఘవేంద్రవర్మ ఆధ్వర్యంలో విద్యార్థులు జిల్లాలోని అన్ని ప్రముఖ దేవాలయాలు, గండికోట, పెద్దదర్గాతో పాటు ఇతర దర్గాల చిత్రాలను ఆకర్షణీయంగా చిత్రించారు. వీటిలో జిల్లా స్థాయిలో పది ఎంట్రీలు ఎంపిక చేస్తామని, జోనల్ స్థాయిలో 100 ఎంపిక చేస్తామని, జాతీయ స్థాయిలో తుది ఎంపిక నిర్వహించి విజేతలను ప్రకటిస్తామని నిర్వాహకులు తెలిపారు. పాల్గొన్న విద్యార్థులందరికీ నిర్వాహకులు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.